“అసలే ఆయన హార్టు పేషెంట్ కావాలంటే మొన్న నువ్వు నవీన్‌కి చెప్పావ్‌గా అలా ఇక్కడున్న అందరికీ మన విషయం గురించి చెప్పేయ్. మా అమ్మా నాన్నలకు మాత్రం ఈ విషయాన్ని సమయం చూసి చెప్తాను” బ్రతిమిలాడుతూ దీనంగా అన్నాడు బుచ్చిబాబు.

“ఒరేయ్ పింజారి వెధవా ..... తలుపులు తీస్తావా బద్దలుకొట్టనా?”

తలుపుల చెక్కలూడేలా బాదసాగాడు పర్వతాలరావు .

“హమ్మే ... సీత ప్లీజ్! నువ్విక్కడినుండి తక్షణం వెళ్ళిపో....”

“ఎక్కడికి?”

“మా మోహన్ ఇంటికి” చెప్పాడు బుచ్చిబాబు.

“ఛీ.. అతనా? అతనంటే నాకిష్టంలేదు” మొహం చిట్లించింది సీత .

“అలాగంటే ఎలా మోహన్ చెడ్డాడేం కాదు. అయినా ఇక్కడ నాకు తెలిసినవాళ్ళు వేరే ఎవరూ లేరు.”

“కానీ అతనితో ఏం చెప్పాలి?” ఆలోచిస్తూ అంది సీత .

“ఒరేయ్ దగుల్బాజి వెధవ...తలుపు తీస్తావా లేదా?”

పర్వతాలరావు దెబ్బకి తలుపు  చెక్కలు కదిలిపోయాయి.

“బాబోయ్... ఇలా తర్జనభర్జన్లు చేసి ప్రయోజనంలేదు. నువ్వు వెంటనే వెళ్లిపో... ఆ మోహన్‌గాడికి ఏదయినా నీకు తోచింది చెప్పు” సీత వీపుమీద చెయ్యి వేసి తోసాడు బుచ్చిబాబు.

“బట్టలు తీసికెళ్ళాలా?” అడిగింది సీత .

“ఊ....నీ షూట్‌కేస్ తీసుకుని వెళ్ళు”

“ఇంతకీ ఎన్నిరోజులు వాళ్ళింట్లో వుండాలి?”

“అబ్బా! నేను తర్వాత వచ్చి మాట్లాడ్తా కదా నువ్వెళ్ళు”.

“కూరా, చారు అన్నీ అయిపోయాయి. నువ్వు అన్నం మాత్రం వండుకో”

“సరే సరే సరే... నువ్వు పద”

సీత సూట్‌కేసు అందుకుని వెనుక తలుపుగుండా బయటికెళ్ళి పోయింది.

బుచ్చిబాబు పరుగెత్తుకుంటూ వెళ్ళి ముందు తలుపులు తెరిచాడు. ఎదురుగ పర్వతాలరావు కోపంగానూ, పార్వతమ్మ అయోమయంగానూ నిల్చుని వున్నారు.

“అదేంట్రా ఒంటరిగా వుండి హోటల్‌తిండి తిని నీ మతేమైనా చలించిందా పాపం?” అడిగింది పార్వతమ్మ.

“కాదు..... దెయ్యం  పట్టింది తింగరెధవకి?” ముక్కులు పొంగిస్తూ అన్నాడు పర్వతాలరావు.

“రండి.....రండి  లోపలికి రండి నాన్నా! బాగున్నావా అమ్మా?” అంటూ వారి చేతిలోని సూట్‌కేసులు అందుకుని లోపలికి దారి తీసాడు బుచ్చిబాబు .

ఆ ఇద్దరూ అతని వెనకాలే లోపలికి వచ్చాడు.

"ఆ! ఏం బాగోడమోలే నువ్వెళ్ళిన దగ్గర్నుంచి బెంగపెట్టు కున్నాం చూడు ఎలా చిక్కిపోయానో పాపం" అంది పార్వతమ్మ .

"నువ్వేం చిక్కలేదు. బాగానే వున్నావే" అన్నాడు బుచ్చిబాబు. సూట్‌కేసులు మూల పెడుతూ.

"ఆ!" నోరు తెరిచింది పార్వతమ్మ .

"వచ్చిన వెంటనే మొహాన దభీలున తలుపులేసేసి పావుగంట బయట నిలబెట్టి ఇప్పుడు కుశల ప్రశ్నలేస్తున్నావా ఏబ్రసెధవా? అసలు తలుపులు ఎందుకేసావు? లోపల ఏం వెధవపని చేస్తున్నావు?" మండిపడ్డాడు పర్వతాలరావు .

"హవ్వ......హవ్వ" మూతిమీద కొట్టుకున్నాడు "నేనేం వెధవ పని చేస్తాను సిల్లీగా? ఇల్లంతా చాలా కంగాళీగా వుంది. మీరు అలాగే చూస్తే బాధతో గిజగిజలాడిపోతారని తలుపులేసేసి ఇల్లు నీట్‌గా సర్ది తర్వాత తలుపులు తీసా"

"ఏడ్చినట్టేవుంది నీ నిర్వాకం? మరి మమ్మల్ని చూసి అంతచేటున ఎందుకరిచావు?"

"అంటే....... అదీ....... ఆనందం పట్టలేక అలా అరిచానన్నమాట"

నిజమేనా అన్నట్టు చూసాడు పర్వతాలరావు బుచ్చిబాబు వంక.

"మీరు కూర్చోండి నేను కాఫీకాచి పట్టుకొస్తా" అన్నాడు బుచ్చిబాబు వంటగదిలోకి వెళుతూ.

"అయ్యో నువ్వు కాఫీ కాయడం ఏంట్రా పాపం....నేనొస్తా పద" అని బుచ్చిబాబు వెంటపడింది పార్వతమ్మ.

వంటగదిలోని చారు, కూరగిన్నెలు చూసి ఆశ్చర్యతో ముక్కున వేలేసుకుంది పార్వతమ్మ.

"ఏంట్రా? నువ్వు స్వయంగా వంటపని చేసుకుంటున్నావా?"

"హి హి హి....అవునే అమ్మా...నేనే చేసుకుంటున్నా సిల్లీగా!" అన్నాడు బుచ్చిబాబు .

"అయ్యో పాపం! అందుకేరా నాయనా చిక్కిపోయావు"

"నేనే వండుకుంటున్నానంటే అందుకే చిక్కిపోయావ్ అంటావు. నేను వంటచేసుకోకుండా హోటల్లో తింటున్నానంటే హోటల్లోతిండి పడక చిక్కిపోయానంటావు ఎలాగయినా నువ్వామాట అనడం మాత్రం ఖాయం."

"అదేరా తల్లిప్రేమంటే....." బుచ్చిబాబు నెత్తిన చిన్నగా మొట్టింది పార్వతమ్మ.

0 0 0

"అమ్మో....... ఆఫీసుకి టైమైపోయింది" కంగారుగా అన్నాడు మోహన్.

"భోంచేసేశారు. డ్రెసప్ కూడా అయిపోయారు. ఇంక షూస్ వేసుకుని బయలుదేరడమే! అయినా ఎందుకా కంగారు?" అడిగింది భార్య రామలక్ష్మి.

"సరే.....సరే ఆ షూస్ ఇలా తొయ్"

రామలక్ష్మి సోఫాలో కూర్చున్న మోహన్ దగ్గిరికి బూట్లు తన కాలితో తోసింది. మోహన్ బూట్లు తొడుక్కుని లేచి నిలబడ్డాడు.

"వస్తానే రామూ....." అని వీధిగుమ్మం వైపు అడుగులు వేసాడు మోహన్.

సరిగ్గా అప్పుడే డోర్ బెల్ మోగింది

"హు! సరిగ్గా ఆఫీసుకెళ్ళే సమయానికి ఎవరు వచ్చారు?" విసుక్కుంటూ తలుపు తీశాడు మోహన్.

ఎదురుగా సీత !

ఆమెని చూడగానే మోహన్‌కి ఆనందం, ఆశ్చర్యం కలిగింది. కానీ అంతలోనే సీత చేతిలోని సూట్‌కేస్ చూడగానే మోహన్‌కి చాలా అయోమయంగా అనిపించింది.

"మీ మీ మీరా? ఏంటది?" గుటకలు మింగుతూ అన్నాడు మోహన్.

"మీ ఇంట్లో ఉందామనీ" మెల్లగా అంది సీత.

మోహన్ అర్థ కానట్టు చూసాడు. రెండు క్షణాలు ఆగి ప్రశ్నించాడు.

"మీరూ బుచ్చిబాబు గొడవ పడ్డారా?"

సీత తల అడ్డంగా ఉపింది.

"మరి ఈసూట్‌కేసు......" సందేహంగా ఆగాడు.

"బుచ్చిబాబు వచ్చి మీతో మాట్లాడతాడు"

మోహన్‌కి ఈ వింత పరిస్థితి చాలా ఇబ్బందికరంగా అనిపించింది. సీత అక్కడ వుండడం సంతోషకరమయిన విషయమే.......కానీ పెళ్ళానికి ఏం చెపుతాడు?

"ఏంటి? మీకేమయినా అభ్యంతరమా?" సందేహంగా అడిగింది.

మోహన్ అలా ఆలోచిస్తూ నిలబడేసరికి ఆమెకి భయం వేసింది. ఇప్పుడు మోహన్ కుదరదని అంటే ఎక్కడికి వెళ్ళాలి?

ఆమె అడిగిన ప్రశ్నకి మోహన్ వెంటనే రియాక్ట్ అయ్యాడు "అబ్బే.....।అబెబ్బే..... ఇబ్బందేంలేదండీ మీరు రావడం నాకేంటో సంతోషంగా వుంది. రండి రండి లోపలికి రండి".

సీత చేతిలోని సూట్‌కేస్ అందుకున్నాడు మోహన్.

సీత లోపలికి అడుగు పెట్టింది.

"ఎవరండీ వచ్చారు?" అంటూ రామలక్ష్మి లోపలి గదిలించి బయటకి వచ్చింది.

" బుచ్చిబాబు అని మా ఆఫీసులో పని చేస్తున్నాడులే.....అతని......"

మోహన్ చెబుతుండగా సీత మధ్యలో తుంచేస్తూ అంది.

"అంటే మా ఇంటికి చాలా మంది చుట్టాలొచ్చారండీ అసలు కూర్చోవడానికి కూడా

చోటు లేకపోతే బుచ్చిబాబు నన్నిక్కడికి పంపించాడు.”

“మీరిలా లోపలికి రండి” రామలక్ష్మి మోహన్‌ని పిలిచింది.

మోహన్ రామలక్ష్మి వెనకాలే లోపలికి వెళ్ళాడు.

“ఏంటండీ వాళ్ళింట్లో చుట్టాలొస్తే పెళ్ళాన్ని ఇక్కడికి పంపించడం ఏంటండీ? చాలా విచిత్రంగా వుంది. ఎంతమంది చుట్టాలొచ్చినా సర్దుకుని వుంటారుగానీ మొగుడూ పెళ్ళాలూ విడివిడిగా వుంటారాండీ?” అంది రామలక్ష్మి.

“అదే నాకూ విచిత్రంగా వుంది” అన్నాడు మోహన్ ఆలోచనగా.

“అయినా అతను పెళ్ళాన్ని ఇక్కడకు పంపించాడేంటి? మనిద్దరికీ ఆమెతో పరిచయం లేదు. అతను మీతోపాటు ఆఫీసులో పని చేస్తాడు కాబట్టి అతనే ఇక్కడికి రావాల్సింది. మీరిద్దరూ కలిసి పడుకునేవారుగా?”

“నిజమేగానీ అతను ఆమెని పంపించాడు. దానికి మనమేం చేస్తాం. మనం ఇలానే లోపల చర్చిస్తూ కూర్చుంటే ఆమె బయట ఏమయినా అనుకుంటుంది. పద బయటకి పోదాం!” అంటూ ఆమె సమాధానం కోసం ఎదురుచూడకుండా బయటకొచ్చేసాడు మోహన్. రామలక్ష్మి అతనితో పాటు బయటకొచ్చేసింది.

తనకి అంతటి ఇబ్బందికరమయిన పరిస్థితి కలిగించినందుకు బుచ్చిబాబుని తిట్టుకుంటూ నిల్చుంది సీత .

“సారీ సీతగారూ మిమ్మల్ని ఇక్కడే నిలబెట్టినందుకు” సీతకు సారీ చెప్పాడు మోహన్.

“రామూ సీతని లోపలికి తీస్కెళ్ళు”

“రండి సీతగారూ” సీతని ఆహ్వానించింది రామలక్ష్మి.

“నేనొస్తానండీ” సీతకి చెప్పి ఇంట్లోంచి బయటపడి హుషారుగా విజిలేసాడు మోహన్.

0 0 0

భోజనాలు బ్రేవ్‌మని తేనుస్తూ లేచారు పర్వతాలరావు పార్వతమ్మలు.

“ఏమో అనుకున్నాగానీ నువ్వు వంట భలేగా చేసావురా బుచ్చీ పాపం” అంది పార్వతమ్మ సంబరంగా.

“చేసాడులే వెధవ వంట. కూరలో ఉప్పు తక్కువేసాడు. చారులో ఉప్పు ఎక్కువేసాడు వెధవన్నర వెధవ” అన్నాడు పర్వతాలరావు.

“మీరసలు వాడినెప్పుడయినా మెచ్చుకున్నారా పాపం” పార్వతమ్మ భర్తవంక చికాకుగా చూసింది.

“మీరు ప్రయాణం చేసి బాగా అలసిపోయి వుంటారు. కాసేపు పడుకోండి నాన్నా!” అన్నాడు బుచ్చిబాబు .

“నువ్వేంటోయ్ ఇంట్లోనే వుండిపోయావ్. వెధవాఫీసుకు వెళ్ళవా ఏంటి? ఈ వేళ

ఆఫీసుకు శలవా యేంటి?" అడిగాడు పర్వతాలరావు.

"ఆఫీసుకు శలవేం లేదు నాన్నా, నేనే ఆఫీసుకి వెళ్ళాడంలేదు. చాలా రోజులకి మిమ్మల్ని చూసానుకదా! రేపటి నుండి వెళతాను".

"అబ్బో! తల్లిదండ్రులంటే పెద్ద భక్తున్నట్టు పెద్ద వేధవ్వేషాలు"

"ఎందుకడీ వాడిని ఉర్కే ఆడిపోసుకుంటారు పాపం" అంది పార్వతమ్మ బాధగా.

"నాన్నగారి మాటలకేంగానీ మీరు రెస్ట్ తీసోకోండమ్మా.....మీరా బెడ్‌రూంలో పడుకోండి. నేనిక్కడ సోఫాలో నడుంవాలుస్తా" అన్నాడు బుచ్చిబాబు.

పర్వతాలరావు , పార్వతమ్మ బెడ్‌రూంలోకి వెళ్ళారు.

బుచ్చిబాబు హాల్లో సోఫాలో నాడుం వాల్చాడు.

అయిదు నిముషాలు గడిచాయి.

అంతలో భయంకరమయిన గావుకేక!

"బాబోయ్!"

అది పార్వతమ్మ  పెట్టిన గావుకేక.

అ కేకకి బుచ్చిబాబు గుండెలవిసిపోయాయి. ఎందుకలా అరిచింది? అమ్మకేమయింది? కొంపదీసి' నాగరాజు  సంగనాచి' సినిమాలో హీరోని మంచం క్రింద నుంది పామొచ్చి కాటేసినట్టు ఇక్కడ కూడా జరగలేదుకదా?

బుచ్చిబాబు సోఫాలోంచి ఒక్క గెంతు గెంతి బెడ్‌రూం దగ్గరికి పరుగుతీసాడు.

గుమ్మం దగ్గర అగిపోయి లోపలికి అందోళనగా చూసాడు.

పార్వతమ్మ కుడి చేయి పైకెత్తి ఒక బ్రాసరీని పట్టుకుని ఉంది. ఆమె దాన్ని అందోళనగానూ, పర్వతాలరావు దాన్ని అశ్చర్యంగానూ చూడసాగారు.

అ దృశ్యాన్ని చూసిన బుచ్చిబాబు భయంకరంగా అరిచాడు "కెవ్వ్వ్"

"ఏంట్రా ఇదీ........?"

కాస్సేపయ్యాక అడిగింది పార్వతమ్మ .

"అదీ.... అదీ.....నన్నడుగుతావేం?"

"అదేంటి మాకు తెలీకకాదు...... అదిక్కడ ఎందుకుందీ అని అడుగుతున్నాం" అరుస్తున్నట్టుగా అన్నాడు పర్వతాలరావు.

బుచ్చిబాబు బుర్రంతా గందరగోళంగా మారిపోయింది.

"అదీ....మరే.......మరే ...... నాదే....... అందుకని ఇక్కడ ఉంది" చటుక్కున అనేశాడు.

పార్వతమ్మ, పర్వతాలరావులు ఆ సమాధానానికి ఉలిక్కిపడ్డారు. పార్వతమ్మయితే నేలమీద కూలపడిపోయింది.

"నువ్వు మరీ అంత ఘోరంగా ఉలిక్కిపడిపోనక్కర్లా......" విసుక్కుంటూ పార్వతమ్మ జబ్బపట్టుకుని నేలమీంచి లేపాడు పర్వతాలరావు.

తర్వాత బుచ్చిబాబు వంక సీరియస్‌గా చూస్తూ ప్రశ్నించాడు "అది నీదా? నువ్వు దాన్నెందుకు కొనుకున్నావ్? చెప్పరా వెధవకుంకాయ్"

"అంటే .... మరీ... ఈ ఊళ్ళో ఉక్కపోత ఎక్కువ కదా... అందుకని బనీన్లు మొత్తం కవర్ చేస్తాయ్... ఇదైతే కాస్తంత మేరే కవర్ చేస్తుంది.... అందుకనీ!" బుర్ర గోక్కున్నాడు బుచ్చిబాబు .

"నీ వెధవ ఆలోచన్లు ఏడ్చినట్టే ఉన్నాయ్.. అంతగా ఉక్కపోత ఎక్కు వైతే బనీన్లు వేసోకు. అంతేగాని బాడీలు వేసోకడం ఏంట్రా పింజారీ వెధవా... హవ్వా హవ్వ హవ్వ!" నోటి మీద కొట్టుకున్నాడు పర్వతాలరావు.

"అంటే ఇక్కడ విజయవాడ్లో చాలా మంది బాడీలు వేస్కుంటారు. మరేం ఫర్వాలేదేమోనని నేనూ వేసుకుంటున్నా..." బిక్క మొహం వేస్కుని అన్నాడు బుచ్చిబాబు .

ఇంతలో పార్వతమ్మ మళ్ళీ కెవ్వుమని అరిచింది. బుచ్చిబాబూ పర్వతాలరావు ఉలిక్కిపడి పార్వతమ్మ వైపు చూశారు.

పార్వతమ్మ కళ్ళు ఇంతింత పెద్దవిచేసి నోరు తెరుచుకుని చూస్తూ ఉంది.

ఆమె చూస్తున్న వైపుకి ఇద్దరూ తలలు త్రిప్పిచూశారు.

అక్కడ గూట్లో ఓ అరడజను దాకా చీర్లు. జాకెట్లూ మడతపెట్టి ఉన్నాయ్.

వాటిని చూడగానే బుచ్చిబాబు కృంగిపోయాడు.

'అసలు వీటి గురించి నేనెందుకు మర్చిపోయాను? ఇవన్నీ కనబడకుండా జాగ్రత్తగా ఓ చోట సర్ది తలుపులు తీసివుండాల్సింది!'

మనసులో అనుకొని నొసలు మీద అరచేత్తో టప టపా కొట్టుకున్నాడు.

"యెందుకలా కొట్టుకున్నావ్?" బుచ్చిబాబు వంక అనుమానంగా చూస్తూ ప్రశ్నించాడు పర్వతాలరావు.

"అంటే వీటి గురించి కూడా చెప్పడం మర్చిపోయాను కదా అనీ...." గుటకలు మింగాడు బుచ్చిబాబు .

"వీటి గురించికూడా ఓ వెధవ కథ వుందా? ఏంటది?"

"అవి కూడా నావేనన్నమాట!" అన్నాడు బుచ్చిబాబు నీర్సంగా.

"హమ్మో....హమ్మో....మా అబ్బాయ్ వెర్రాడై పోయాడు దేవుడోయ్" పార్వతమ్మ గుండెలు బాదుకుంది.